


# తొలిప్రేమలో బలముందిలే...



**"అయితే మీ గర్ల్‌ఫ్రెండ్ నిర్మల ఈ శనివారానికేగా డిన్నర్‌కి వచ్చేది..?" అడిగింది మాలతి భర్తని**

**"కొంపదీసి ఆవిడ ముందు గర్ల్‌ఫ్రెండ్ అన్నావు గనక. నేను నీతో ఫ్రాంక్‌గా చెప్పానుగా. ఆవిడంటే నేను పడిచచ్చేవాణ్ణి గానీ, ఆవిడ నన్నొక ఫ్రెండ్‌గానే చూసేదని. క్లాస్‌మేట్స్‌మి కదా, ఇన్నాళ్ల తర్వాత కనబడ్డాం. డిన్నర్‌కి రమ్మన్నాను, అంతే. నువ్వు లేనిపోనివి పుట్టించకు, పుణ్యముంటుంది." అన్నాడు రవి ఖంగారు పడుతూ.**

"అబ్బ, పెళ్లయి ఏడాది కావొస్తున్నా ఇంకా నా సంగతి మీకు అర్థం కాలేదుకదా. ఊరికే టీజ్ చేస్తేనే మీ కంత ఖంగారెందుకు? ఇలా అయితే అనుమానించేస్తానంతే! హిపాక్రసీ లేకుండా మాట్లాడ్డమే మీలో నాకు బాగా నచ్చే లక్షణం. డిన్నర్ కేం చెయ్యాలని అడుగుదామంటే నీరేమో.."

"ఖంగారేముంది? నేను ఊరినుంచి వచ్చేది శుక్రవారం. ఆవిడ కాన్ఫరెన్స్ శనివారం మధ్యాహ్నం దాకా ఉంది. శుక్రవారం సాయంత్రం వెళ్లి కావలసినవి కొందాం. అవునూ, నీకివాళ మీ క్లాసుమేటు మ్యారేజి రిసెప్షన్ ఉంది కదా, స్టేషనుకి ఆటోలో వెళ్లేటప్పుడు నిన్నక్కడదింపేసి వెళ్లనా?"

రిసెప్షన్‌కి మాలతి క్లాసుమేట్స్ చాలా మంది వచ్చారు. చాలామందికి పెళ్లిళ్లయ్యేయి. –"తన ప్రేమ ఒన్‌సైడెడ్ అని రవి చెప్పారే అనుకో. నిర్మలకిలాటి అభిప్రాయం ఉండేది కాదని నీకేం తెలుసు? మీ ఆయనకే తెలీదు. ఆవిడా మనసులో దాచుకుందేమో. ఇలా వాళ్లు కలిసే అవకాశాలు మనంతట మనమే వాళ్లకి కలుగజేయడం ఎందుకు?"

"పోవే పిచ్చిదానా" అంటూ మాలతి విదిలించేసింది.

భోజనాల దగ్గర రెడ్డిని చూసి ఆశ్చర్యపడింది మాలతి. "మీరు బెంగుళూరులో ఉంటున్నారన్నారు?"

"నిజమే. పాత క్లాసుమేట్సందరినీ చూసినట్టుంటుందని టూరేసుకుని వచ్చేను. మిమ్మల్ని చూడడం మరీ సంతోషంగా ఉంది" అన్నాడతను. 'మొహంలో ఆ సంతోషం వెల్లివిరుస్తోంది. ఆజానుబాహుడు. స్ఫురద్రూపి. రంగు తక్కువైనా కళైన మొహం. స్పోర్ట్స్ ఛాంపియన్‌గా తనలాటి అమ్మాయిల హృదయాలను కొల్లగొట్టేడంటే కొల్లగట్టడూ? అతనంటే తనెంత పడిచచ్చేది! తనకంటికి నచ్చిన మొదటి మగవాడితనే. కళాకాంతులన్నీ చెక్కు చెదరకుండా ఉన్నాయిప్పటికీ, అప్పట్లో రోజుకో ప్రేమలేఖ అతని పేర రాసి, ధైర్యం చాలక చింపిపారేసేదని అతనికి తెలిస్తే మనుకుంటాడో!" అనుకొంది మాలతి.

"మీ వారు నాయుళ్లా?" అన్నాడు రెడ్డి మాలతి అందించిన అడ్రసు స్లిప్ చూస్తూ

"అవును, సి.ఆర్.నాయుడు అంటే ఎవరైనా..."

"మీరు బ్రామిన్సేమో!? ఇంటర్‌కాస్ట్ మారేజా!? ప్రేమ వివాహమా!!?"

"అబ్బే,కాదండి. మా పేరెంట్స్‌ది కులాంతరమే కదా. కులం పట్టింపు లేదని పేపర్లో వేయించారు. అది చూసి ఈయన రెస్పాన్స్ ఇచ్చారు..."

రెడ్డి వినడం లేదు. మొహమంతా వివర్ణమయిపోయింది. ఏదో గొణుక్కుంటున్నాడు. 'ఛ,ఛ' అనుకున్నాడు. కాస్సేపటికి తలెత్తి తనకేసి చూసేసరికి కళ్ళల్లో లీలగా కన్నీళ్ళు. "చూడండి, వాటే ఫూల్ ఐ యామ్? సరిగ్గా కనుక్కోనేలేదు. ఏదేదో ఊహించుకొని, భయపడి, ఛ..." అని మళ్లీ తల విదిల్చేడు. మాలతికి ఏమనాలో తెలియలేదు. భర్త గురించి ఏదేదో మాట్లాడసాగింది. అదృష్టవశాత్తూ ఎవరో వచ్చి రెడ్డిని పలకరించి తమతో తీసుకెళ్లారు.

ఆ రాత్రి వెళ్లిపోయేటప్పుడు రెడ్డి మాలతి దగ్గరికి మళ్లీ వచ్చేడు. "రేపు పన్నెండు గంటల బస్సుకు వెళుతున్నాను. మీకు వీలైతే బస్‌డిపోకి వస్తారా? కాస్సేపు మాట్లాడుకోవచ్చు" అన్నాడు. సరేనంది మాలతి.

మర్నాడు పన్నెండు గంటల బస్సు కాన్సిలయింది. గంటన్నర తర్వాతనే మరో బస్‌ట. బాగ్ క్లోక్‌రూమ్‌లో పడేసి, "అంతసేపూ ఏం చేద్దాం? రెస్టారెంట్లో కూచోడం బోరు" అన్నాడతను.

"దగ్గర్లో మునిసిపల్ స్టేడియం ఉంది, వెళదామా, ఫర్ ఓల్డ్ టైమ్స్ సేక్" అంది మాలతి.

స్టేడియం నిర్మానుష్యంగా కనబడింది. పనివాళ్లు ఏ మూలో జోగుతున్నారులా ఉంది. గ్రౌండ్‌లోకి రాగానే "రన్నింగ్‌రేస్ చేద్దామా?" అన్నాడు రెడ్డి హుషారుగా. "నేను వేసుకున్నది చీర, ట్రాక్‌సూట్ కాదు, అయినా మీతో రేసా, బాబోయ్!" అంది మాలతి. "నేనూ ఈ మధ్య ప్రాక్టీసు చేయటం లేదు. పోనీ మీరు సగం దూరం ముందు వెళ్లి నుంచోండి" అన్నాడు రెడ్డి.

పరిగెడుతూంటే చీర కాళ్ళకడ్డం పడి తూలబోయింది మాలతి. అతను వచ్చి చటుక్కున పట్టుకున్నాడు. "కాలు బెణికినట్టుంది" అందామె. సునాయాసంగా రెండు చేతులా ఆమెను గాలిలోకి ఎత్తేసాడు. ఎత్తి, గాలరీ సిమెంటు బెంచీల మీద పడుక్కోబెట్టాడు. మాలతి కిలకిలలాడింది. రెడ్డి తన్ను అలా తీసుకురావడంతో. రెడ్డి కూడా నవ్వేడు, పకపకా. ఎందుకో అతనికీ తెలీదు: మోసుకురావడం వల్లా, నవ్వడం వల్లా అలువు వచ్చినట్టుగా వుంది. ఆమెను పడుక్కోబెట్టిన బెంచీ కింద బెంచీల్లోనే తనూ పడుక్కొని అలువు తీర్చుకోసాగాడు.

మాలతి లేచింది. శ్రీ మహావిష్ణువులా చేతికి తలాన్చి అతనికేసి సాలోచనగా చూసింది. ఒగరుస్తుండడం వల్ల అతని ఛాతీ ఎగిరి ఎగిరి పడుతోంది. అప్రయత్నంగానే ఆమె చేయి ముందుకు సాగింది. అతని ఛాతీ నిమరాలని. కానీ అంతలోనే అతడు

"నీ వెనక్కాల పురుగో పాకుతున్నట్టుంది, చూసుకో" అన్నాడు. ఖంగారుపడి ఆమె దొర్లింది. కింది మెట్టుపైనున్న అతనిపైకి. అతను బాలన్స్ కాచుకోడానికో ఏమో, చేతులతో ఆమెను చుట్టివేశాడు. ఆ స్థితిలో నుండి బయటపడాలనిపించలేదు మాలతికి. కానీ కింద బెంచీపై నుండి కుక్క ఒకటి పోతూ, పోతూ 'భోయ్' మంది. ఉలిక్కి పడ్డట్టు కౌగిలి విదిలించుకొని ఆమె తన మెట్టుపైకి చేరింది.

రెడ్డి మౌనంగా, ఆర్ద్రంగా ఆమెకేసే చూస్తున్నాడు. పెదాలు ఏమో మాట్లాడబోయి ఆగిపోయినట్టున్నాయి.

"ఆడవాళ్లు, అవకాశం సృష్టించుకున్న మగవాళ్లనైనా క్షమిస్తారు కానీ దాన్ని జారవిడుచుకున్న వాళ్లని క్షమించరట, విన్నావా" అంది మాలతి అతనికేసి నవ్వుతూ చూస్తూ. అన్నది కానీ అతని కళ్లల్లో నీళ్లు చూసి బాధపడింది. ఎందుకన్నానా అని. 'నన్ను నేనే క్షమించుకోను ధైర్యం చేయనందుకు" అన్నాడు రెడ్డి.

ఆమె అతని కన్నులు తుడిచింది. అతనామె చేతిని అలాగే తన పెదాల దాకా తెచ్చి ముద్దాడి వదిలేశాడు. "ఇంకా సేపుంటే డేంజరు, వెళ్లిపోదాం రా" అన్నాడతను.

ఆ రాత్రే మాలతి పరిస్థితి సమీక్షించుకుంది. 'తను బ్రామిన్ అనుకున్నాడు రెడ్డి. ఇంటర్‌కాస్ట్‌కు ఒప్పుకోదన్న భయంతో ప్రపోజ్ చేయడానికి కూడా సంకోచించాడు. తనపై ప్రేమను మనసులోనే దాచుకున్నాడు. అది తలచుకుంటేనే తన ఒళ్లు ఎంతగానో పులకరిస్తోంది. భర్త వద్ద కూడా అలాటి అనుభూతి ఎన్నడూ కలగలేదు. 'తొలి ప్రేమలో బలముందిలే' అన్న కవి మాటల్లో ఎంత నిజముందో తెలుస్తోంది. మళ్లీసారి వచ్చినప్పుడు కలుద్దామని అతనంటే సరేనంది తను. కానీ... తన మానసిక స్థితి ఇలా వున్నప్పుడు అది మంచిదేనా? ఈసారి చూపించిన నిగ్రహం వచ్చేసారి చూపలేకపోతే? దేనికి దారితీస్తుందో ఇది?... ఇంతటితో స్వస్తి చెప్పే సరి.

అవునూ, మరి నిర్మల సంగతి కూడా రెడ్డి లాటిదేనా? ఆమె కూడా రవి పట్ల ప్రేమ మనస్సులో దాచుకుందేమో. అది ఈసారి రవిని కలుసుకున్నప్పుడు బయటపడితే? తొలి ప్రేమ బలం తనకు తెలిసివచ్చిందిగా, భర్తా, నిర్మలా కూడా తనలాటి వాళ్లు కారూ? కానీ నిగ్రహం విషయంలో తనకంటే ఎక్కువా, తక్కువా? ఏమో. ఒకవేళ తక్కువైతే? ఏ బలహీన క్షణంలోనో లొంగిపోతే? ఎందుకొచ్చిన గొడవ? నిర్మలను డిన్నర్‌కి పిలవడానికి వీల్లేదని గట్టిగా చెప్పేస్తే సరి'

ఆ నిర్ణయం తీసుకున్నాక మాలతికి నిద్ర పట్టింది.

— ప్రసాద్

